

రేషన్..బహుదూరం



గుట్టలు ఎక్కుతూ దిగుతూ రేషన్ సరుకులు తెచ్చుకుంటున్న గిరిజనులు(ఫైల్)

జిల్లాలో ఇదీ పరిస్థితి..

జిల్లాలోని 15మండలాల పరిధిలో మొత్తం 1,40,024 రేషన్ కార్డులున్నాయి. వాటిపరిధిలో 6లక్షలపైనే సభ్యులుండగా, వీటిపరిధిలో అంత్యోదయ కార్డులకు నెలకు 35కిలోలు, అన్నపూర్ణ కార్డులకు నెలకు10 కిలోల బియ్యాన్ని ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. అయితే చాలాచోట్ల జిల్లాలోని పూర్వపంచాయతీలకు 5కి.మీ.ల లోపు ఉన్నాయి. ప్రతీ నెలా పూర్వపు పంచాయతీలకు వెళ్లి సరకులు తెచ్చుకునేందుకు ఇబ్బందులు పడుతున్నా రు. గత ప్రభుత్వ హయాంలో కొత్త పంచాయతీల్లో రేషన్ దుకాణాల ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందించారు. కానీ అయిదేళ్లు దాటినా ఆచరణకు నోచుకోలేదు. కొన్నిచోట్ల తక్కువ రేషన్‌కార్డులు ఉండంతో దుకాణాల ఏర్పాటు సాధ్యం కాదని అధికారులు చెబుతున్నా రు. ప్రత్యామ్నాయంగా డీలర్లు దుకాణాలు లేని ఊర్లల్లోకి సరకులు తీసుకెళ్లి పంపిణీ చేయాలని ప్రాథమికంగా ఆదేశించినప్పటికీ అమలు కావడం లేదు. రవాణాఖర్చులు అవుతాయని డీలర్లు తమ దుకాణా ల్లోనే సరకులు పంపిణీ చేస్తుండడంతో వినియోగదారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

- రేషన్ సరుకులు తెచ్చుకునేందుకు తంటాలు
- కొత్త గ్రామ పంచాయతీల్లో ఏర్పాటుకు నోచుకోని దుకాణాలు
- కాగితాలకే పరిమితమైన ప్రతిపాదనలు
- కొత్త ప్రభుత్వంపైనే ఆశలు

చింతలమానేపల్లి, మార్చి 22: జిల్లాలోని చింతలమానేపల్లి మండలం కోయపెల్లి గ్రామపంచాయతీ కొత్తగా ఏర్పడి 5 ఏళ్లు గడుస్తోంది. అక్కడ 600పైనే జనాభా నివస్తున్నారు. అయితే రేషన్‌షాపు అక్కడ లేక పోవ డంతో పాత గ్రామపంచాయతీ 3కి.మీ. దూరంలో ఉన్న గూడెం గ్రామానికి వెళ్లి ప్రతీనెలా రేషన్ సరుకులు తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. సరకులు తెచ్చుకునేందుకు వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బందులు పడుతున్నారు. కొందరు ప్రైవేటు వాహనాలు ఆశ్రయించి ఆర్థికంగా నష్టపోతున్నారు. కొత్తగా రేషన్‌షాపు ఇక్కడే ఏర్పాటు చేస్తే తమకు ఇబ్బందులు ఉండవని గ్రామస్థులు చెబుతున్నారు.

ఈ విషయం ఇదివరకు అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఫలితం లేకుండా పోయిందన్నారు. కొత్తగా జీపీ ఏర్పాటు చేశారే తప్ప సౌకర్యాలు కల్పించడంలో అధికార యంత్రాంగం, పాలకులు విఫలమయ్యారన్న ఆరోపణలు జిల్లా వ్యాప్తంగా ఉన్నాయి. జిల్లాలో కొత్తగా ఏర్పడ్డ జీపీల పరిస్థితి ఇది. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న పేదకుటుంబాలకు ప్రభుత్వం ఉచితంగా రేషన్ సరఫరా ఇస్తుంది. రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేదల ఆకలి తీరుస్తుంది. జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో కొత్త గ్రామ పంచాయతీలు ఏర్పడ్డాయి. వాటిలో రేషన్ దుకాణాలు అందుబాటులోకి రాకపోవడంతో స్థానికు లకు సరకుల కోసం దూరభారం తప్పడం లేదు. కాలినడకన కొన్ని కిలోమీటర్ల దూరం వెళ్లి సరకులు తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

కొత్తగా రేషన్ దుకాణాల ఏర్పాటుకు ప్రతిపాదనలు అమలుకు నోచు కోవడం లేదు. దీంతో వినియోగదారులు ప్రతి నెలా సమీపంలోని గ్రామాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెల కొంది. తమ సమస్యలపై అధికారులకు. ప్రజా ప్రతినిధులకు విన్నవించినా స్పందనలేక పోవడంతో ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్త ప్రభుత్వమైనా రేషన్ షాపులు మంజూరు చేస్తే రేషన్ సరకుల వెతలు తీరనున్నాయి.

రేషన్‌షాపులు ఏర్పాటు చేయాలి..

నందరాం, కోయపల్లి

గత ప్రభుత్వం కొత్తగా గ్రామపంచాయతీలను ఏర్పాటు చేసింది. కాని సౌకర్యాలు కల్పించడంలో విఫలమయ్యింది. మాది పూర్వపు గూడెం గ్రామపంచాయతీలో నుంచి కొత్తగా కోయపెల్లి జీపీ ఏర్పాటైంది. ప్రతీనెలా రేషన్‌సరకుల కోసం 3కి.మీ.ల దూరంలో ఉన్న గూడెం గ్రామానికి వెళ్లి తెచ్చుకుంటున్నాం. వృద్ధులు, దివ్యాంగులు అనేక అవ స్థలు పడుతున్నారు. మా గ్రామంలో రేషన్‌షాపు ఏర్పాటుచేస్తే ఇబ్బందులు ఉండవు. ఇదివరకే చాలాసార్లు ఈ విషయాన్ని అధికారులకు చెప్పినా ఫలితం లేదు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి

- ఎస్పీ సురేష్ కుమార్



గ్రేహౌండ్స్ బలగాలకు భోజనం వడ్డిస్తున్న ఎస్పీ సురేష్‌కుమార్

ఆసిఫాబాద్, మార్చి 22: రాబోయేపార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఎలాంటి వర్గబేధాలు లేకుండా అల్లర్లు జరగకుండా ప్రజలంతా సహక రించాలని ఎస్పీ సురేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆసిఫాబాద్ పట్టణంలో పారామిలటరీ దళాల ఫ్లాగ్ మార్చ్‌ను జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం పారామిలిటరీ బలగాల కోసం ఏర్పాటు చేసిన సదుపాయాలను పరిశీలించి వారికి ఎన్నికలకు సంబంధించిన సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సమస్యాత్మకపోలింగ్ కేంద్రాలపై ప్రత్యేకదృష్టి సారించామన్నారు. ఎవరైనా చట్టవిరుద్ధంగా ప్రవర్తించినా, గొడవలు సృష్టించాలని చూసినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ ప్రభాకర్, డీఎస్పీ సదయ్య, సీఐలు సతీష్ శ్రీనివాస్, చిట్టబాబు, ఎస్సైలు పాల్గొన్నారు.

శిక్షణను పర్యవేక్షించిన ఎస్పీ

జిల్లా కేంద్రంలోని ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో వారం రోజుల పాటు గ్రేహౌండ్స్ బలగాలకు ఇస్తున్న ప్రత్యేకశిక్షణను శుక్రవారం ఎస్పీ సురేష్‌కుమార్ పర్యవేక్షించారు. ఈసందర్భంగా సిబ్బందితో కలిసి మధ్యాహ్నభోజనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోలీసు సిబ్బంది శారీరక దారుఢ్యం కోసం, మావోయిస్టు కదిలికలపై ప్రత్యేకనిఘా కోసం ఈశిక్షణ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ ప్రభాకర్, డీఎస్పీ సదయ్యా, సీఐ సతీష్, ఆర్ఐ పెద్దన్న, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్, అదనపు కలెక్టర్‌ను కలిసిన డీఎం



కలెక్టర్‌ను సన్మానిస్తున్న డీఎం విశ్వనాథ్

ఆసిఫాబాద్, మార్చి 22: ఆసిఫాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్‌గా ఇటీవల బాధ్యతలను చేపట్టిన విశ్వనాథ్ శుక్రవారం కలెక్టర్ వెంకటేష్ దోత్రే, అదనపు కలెక్టర్ దీపక్ తివారిని కలెక్టరేట్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని ఘనంగా సన్మానించారు. అనంతరం ఆర్టీసీ ద్వారా ప్రయాణికులకు అందిస్తున్న సేవలు మహాలక్ష్మి పథకం తదితర అంశాలపై చర్చించారు. ఆయనవెంట సూపరింటెండెంట్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

భూకబ్జాపై తహసీల్దార్‌కు ఫిర్యాదు



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్థులు

బెజ్జూరు, మార్చి 22: మండలంలోని లంబాడీగూడ గ్రామంలో ప్రభుత్వ స్థలంలో నిర్మించిన పాఠశాల భవనాన్ని బీజేపీ నాయకుడు మోహన్ కూల్చి స్థలాన్ని కబ్జాచేశారని శుక్రవారం గ్రామస్థులు తహసీల్దార్ భూమేశ్వర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో విద్యార్థులు చదువు కోసం పక్క గ్రామాలకు వెళ్లాల్సి వస్తుందని, ప్రభుత్వపాఠశాల భవనాన్ని కూల్చి స్థలాన్ని ఆక్రమించిన అతనిపై కఠినచర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు.

పెన్షన్ నిలిపి వేయడం సరికాదు

చింతలమానేపల్లి, మార్చి 22: అధికారులు తనపెన్షన్ నిలిపివేయడం సరికాదని మండలానికి చెందిన గీతకార్మికుడు రామగోని నీలాగౌడ్ ఆవేదన వ్యక్తంచేశాడు. శుక్రవారం మండలకేంద్రంలో ఆయన మాట్లాడుతూ కొన్నేళ్లుగా గీత కార్మికుడిగా వచ్చే తనపెన్షన్‌ను ఎంపీపీ నానయ్య అధికారులకు చెప్పి నిలిపి వేయించాడన్నారు. ఎంపీపీభార్యకు బోదకాలు లేకున్నా తప్పుడు సర్టిఫికేట్ పెట్టికొన్నేళ్లుగా పెన్షన్ పొందుతున్నాడన్నారు. ఎంపీపీ తనపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నట్లు ఆరోపించాడు. ఈ విషయంలో అధికారులకు ఫిర్యాదు చేశానని వెంటనే తనకు పెన్షన్ మంజూరు చేయాలని కోరారు.

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

వాంకిడి, మార్చి 22: పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి శివప్రసాద్ కోరారు. శుక్రవారం మండలంలోని ఇందాని గ్రామంలో 560పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో సిబ్బంది గణపతి, వినోద్, నవీన్, లాలాజీ, ఇమ్రాన్ పాల్గొన్నారు.

గ్రామాల్లో పోషణ్ పక్వాడ

వాంకిడి, మార్చి 22: మండలంలోని వాంకిడి, సరండి తదితర గ్రామాల్లో అంగన్‌వాడీకేంద్రాల్లో శుక్రవారం పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు అందించాల్సిన పౌష్టిక ఆహారంపై ఆయాకేంద్రాల అంగన్‌వాడీటీచర్లు అవగాహన కల్పించారు. పౌష్టిక ఆహారంతోనే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారన్నారు.

మనోధైర్యంతో పరీక్షలు రాయాలి

లింగాపూర్, మార్చి 22: విద్యార్థులు మనోధైర్యంతో పరీక్షలు రాయాలని జిల్లా ఆశ్రమపాఠశాల ఏసీఎంవోఉద్ధవ్ అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని కంచన్‌పల్లి ఆశ్రమపాఠశాల, సిర్పూర్(యు) మండలంలోని కోహినూర్, జైనూర్ ఆశ్రమ పాఠశాలలో పదవ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు ఆయన పలు సూచనలు చేశారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

పెంచికలపేట, మార్చి 22: మండలంలోని బొంబాయిగూడలో నిర్మితమవుతున్న ఆంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో వేణుగోపాల్, సంతోష్, గంగారాం, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు కృషి చేయాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, మార్చి 22: లోక్‌సభ ఎన్నికలను జిల్లాలో ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో కృషిచేయాలని జిల్లాఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అదనపుకలెక్టర్ (స్థానికసంస్థలు) దీపక్ తివారి, ఎస్పీ సురేష్‌కుమార్, ఏఎస్పీ ప్రభాకర్‌రావు, జిల్లా రెవెన్యూ అధికారి లోకేశ్వర్‌రావు, డీఎస్పీ సదయ్యతో కలిసి జిల్లాలో ఎన్నికల నిర్వహణపై నోడల్, సెక్టోరల్ అధికారులు, తహసీల్దార్‌లు, ఎంపీడీవోలు, పోలీసు శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సెక్టోరల్ అధికారులు, పోలీసు సెక్టోరల్ అధికారులు తమ పరిధిలోని అన్ని పోలింగ్‌కేంద్రాలను సందర్శించి పూర్తివివరాలతో నివేదిక సమర్పించాలన్నారు. దివ్యాంగులు, వయో వృద్ధులు, గర్భిణుల కొరకు ప్రతి పోలింగ్ కేంద్రంలో ఓ ర్యాంప్ సౌకర్యం ఉండాలన్నారు. అలాగే తాగునీరు, నీడ, ఫ్యాన్లు తదితర సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. ప్రిసైడింగ్ అధికారులు, సహాయప్రిసైడింగ్ అధికారులు సమన్వయంతో పనిచేయాలనానరు. ప్రతి సెక్టోరల్ అధికారి తమరూట్‌ను పరిశీలించాలని తెలిపారు. సమస్యాత్మిక షాడో పోలింగ్‌కేంద్రాలను గుర్తించి వివరాలు సమర్పించాలని తెలిపారు. పోలింగ్ కేంద్రానికి రాలేని 85సంవత్సరాల పైబడిన వృద్ధులు, దివ్యాంగుల కొరకు హోం ఓటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో నోడల్, సెక్టోరల్ అధికారులు, పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మొరం తవ్వకాలు



ఎక్స్‌కావేటర్‌తో మట్టిని తోడుతున్న అక్రమార్కులు

ఆసిఫాబాద్, మార్చి 22: ఆసిఫాబాద్ పట్టణంలోని జన్కాపూర్ శివారులో అక్రమంగా మొరం తవ్వకాలు జరుపుతున్నారు. రాత్రి వేళ ల్లో శివారు భూముల్లో నుంచి అక్రమంగా ఎక్స్‌కావేటర్‌తో మొరం తవ్వి ట్రాక్టర్ ద్వారా తరలిస్తు సొమ్ము చేసుకుంటున్నారు. పట్టణంలో మొరం, మట్టికిడిమాండ్ ఉండడంతో అక్రమార్కులు రాత్రివేళల్లో శివారు భూముల్లో నుంచి మట్టిని ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ, మైనింగ్ అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఓటరు నమోదుపై అవగాహన ర్యాలీ

వాంకిడి, నవంబరు 22: ఓటు హక్కు వినియోగం, ఓటు హక్కు నమోదుపై శుక్రవారం మండలకేంద్రంలో మండలసమాఖ్య ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ న్విహించారు. 18సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో సీసీలు వేణుగోపాల్, విఠల్, భీంరావు, కవిత, శ్రీదేవి పాల్గొన్నారు.

26న స్థాయీ సంఘ సమావేశాలు

ఆసిఫాబాద్ రూరల్, మార్చి 22: జడ్పీ కార్యాలయం సమావేశ మందిరంలో ఈనెల26న స్థాయీ సంఘాల సమావేశం నిర్వహిస్తామని సీఈవో అనిల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి సభ్యులు, సంబంధితశాఖల అధికారులు ప్రగతి నివేదికలతో హాజరు కావాలని కోరారు.

ఇసుక దందాపై అధికారుల కొరడా



పట్టుకున్న ఇసుక డంపులతో విజిలెన్స్ అధికారులు

రెబ్బెన, మార్చి 22: మండలంలో పలుచోట్ల ఇసుక అక్రమ నిల్వలపై శుక్రవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్సుమెంటు, రెవెన్యూ అధికారులు మెరుపుదాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్సుమెంటు రి సీఐలు వరుణ్ ప్రసాద్, ప్రశాంత్‌రావు వివరాలు వెల్లడించారు. రెబ్బెనలోని పలు ప్రాంతాల్లో ఇసుక డంప్‌లున్నట్లు పక్కా సమాచారం ఉందన్నారు. తమ సిబ్బందితో కలిసి ఏకకాలంలో దాడులు చేసి 300టన్నుల ఇసుకు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్సై నారాయణ, పీసీలు అశోక్, అనిల్, సంపత్ సిబ్బంది పాల్గొన్నట్లు వివరించారు.



పెంచికలపేటలో పట్టుకున్న ఇసుక ట్రాక్టర్‌తో మైనింగ్ ఏడీ గంగాధర్

పెంచికలపేట: అనుమతులు లేకుండా పెద్ద వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను శుక్రవారం మైనింగ్ ఏడీ గంగాధర్ పట్టుకుని పోలీసులకు అప్ప గించారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్ద వాగు, బొక్కివాగు, ఉచ్చ మల్ల వాగులనుంచి ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

అదృశ్యమై.. విగతజీవిగా లభ్యం

సిర్పూర్(టి), మార్చి 22: మండలంలో అయిదారు రోజుల క్రితం మిస్సింగ్ అయిన మహబూబ్‌నగర్ జిల్లా వనపర్తికి చెందిన క్లీనర్ రంగవల్లి రాములు(45) మృతదేహం మండలంలోని అచ్చెల్లి అటవీప్రాంతంలో లభ్యమైంది. రాములు అయిదారురోజుల క్రితం లోడ్‌తో మహారాష్ట్రకు వెళ్తున్న క్రమంలో మండలంలోని పెద్దబండ గ్రామ సమీ పంలో లారీ చెడిపోయింది. డ్రైవర్ మరమ్మతులు చేస్తున్న క్రమంలో రాములు ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. దీంతో డ్రైవర్ కృష్ణ సిర్పూర్(టి) పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసి అతని కుటుంబీకులకు సమాచారం అందించాడు. శుక్రవారం అచ్చెల్లి అటవీప్రాంతంలో మృతదేహం ఉన్నట్లు గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై మృతుడి కుటుంబీకులకు సమాచారం అందించారు. వారు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గుర్తించారు. కాగా రాములు కొంతకాలంగా మతిస్థిమితం కోల్పోయాడని ఎస్సై పేర్కొన్నారు. మృతుడి భార్య రంగవల్లి చిట్టమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.



ఉద్యోగుల రక్షణను పర్యవేక్షించాలి: జీఎం

శ్రీరాంపూర్, మార్చి 22: సింగరేణి ఉద్యోగుల రక్షణను నిరంతరం పర్యవేక్షించాలని జీఎం బి సంజీవరెడ్డి అన్నారు. శుక్రవారం జీఎం కార్యాలయంలో ఏరియా అధికారులతో గనుల్లో రక్షణపై సమీక్షించారు. ఎస్ఆర్పీ1 గనిలో జరిగిన ప్రమాదం దురదృష్టకరమని, మళ్లీ అలాంటివి జరుగకుండా శనివారం నుంచి 27వ తేదీ వరకు అన్ని గనుల్లో హాలేజ్, మ్యాన్ రైడింగ్ సిస్టం, రక్షణపై ఆడిట్ నిర్వహిస్తామన్నారు. ఉద్యోగులకు రక్షణతోపాటు సదుపాయాలు కల్పిస్తామని వివరించారు. కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం వి పురుషోత్తం రెడ్డి, పీవో శ్రీనివాస్, ఏజెంట్లు ఏవీ రెడ్డి, రాముడు, గ్రూప్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

ఓసీపీని సందర్శించిన జీఎం

రామకృష్ణాపూర్, మార్చి 22: రామకృష్ణాపూర్ ఓసీపీని శుక్రవారం జీఎం (ఆర్అండ్‌డీ) ఎస్‌డీ ఎం సుభాని ఏరియా జీఎం మనోహర్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్థికసంవత్సరానికి నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి, రవాణా లక్ష్యాలను సాధించడానికి, తీసుకోవాల్సిన చర్యలపై ప్రాజెక్టు ఆఫీసర్లకు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆర్కే ఓసీపీ అధికారి గోవిందరావు, మేనేజర్ సుధీర్, సీనియర్‌సర్వే ఆఫీసర్ శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

అండర్‌గ్రౌండ్ అలవెన్స్ రికవరీని నిలిపివేయాలి

బెల్లంపల్లి, మార్చి 22: శాంతిఖనిగనిలో కార్మికుల నుంచి చేస్తున్న అండర్‌గ్రౌండ్ అలవెన్స్ రికవరీని వెంటనే నిలిపివేయాలని ఏఐటీయూసీ నాయకులు శుక్రవారం గనిపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ కేంద్ర ఉపాధ్యక్షుడు మిట్టపల్లి వెంకటస్వామి మాట్లాడుతూ అలవెన్స్ రికవరీతో కార్మికులు నష్టపోతున్నారన్నారు. కార్మికులను మానసిక క్షోభకు గురి చేసే ఉత్తర్వులను యాజమాన్యం విరమించుకోవాలన్నారు. అనంతరం గని మేనేజర్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు చిప్ప నర్సయ్య, దాగం మల్లేష్, దాసరి తిరుపతిగౌడ్, మంతెన రమేష్, కార్మికులు పాల్గొన్నారు.

ఉత్పత్తిపై ఉన్న శ్రద్ధ.. కార్మికుల రక్షణపై లేదు

శ్రీరాంపూర్, మార్చి 22: యాజమాన్యానికి ఉత్పత్తిపై ఉన్న శ్రద్ధ కార్మికుల రక్షణపై లేదని ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు జె శంకర్‌రావు అన్నారు. శుక్రవారం ఆయన యూనియన్ నాయకులతో కలిసి ఎస్ఆర్పీ1 గనిని సందర్శించారు. ప్రమాదం జరిగిన తీరును కార్మికుల ద్వారా తెలుసుకున్నారు. ఈ ప్రమాదానికి యాజమాన్యం పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. విచారణ జరిపించి కారకులపై చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో కేంద్ర నాయకులు గరిగెస్వామి, కలవేన శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

నిరంతరం బొగ్గు రవాణా చేయాలి



సీహెచ్‌పీని పరిశీలిస్తున్న డైరెక్టర్

శ్రీరాంపూర్, మార్చి 22: శ్రీరాంపూర్ ఏరియా నుంచి నిరంతరం బొగ్గు రవాణా చేయాలని డైరెక్టర్(ఈఅండ్‌ఎం) సత్యనారాయణరావు అన్నారు. ఏరియా జీఎం బి సంజీవరెడ్డితో కలిసి శ్రీరాంపూర్ ఉపరితల గనిలోని కోల్ హ్యాండ్లింగ్ ప్లాంటు, ఏరియా స్టోర్స్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. ఓసీపీలోని కంట్రోల్‌రూం సెకండరీ సైజర్, సీ2 కన్వేయర్ బెల్టువద్ద బొగ్గు రవాణాను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఏరియా స్టోర్స్‌లో వివిధగనులు, విభాగాలకు కావాల్సినన్ని పనిముట్లు, ఉపరితలగనులకు కావాల్సిన భారీయంత్రాల విడిభాగాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని కార్మికులకు వసతులు కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జీఎం(స్టోర్స్) మాచరయ్య, ఎస్ఓటు డైరెక్టర్ కేవీరావు, జీఎం(సీహెచ్‌పీ) కేశవరావు పాల్గొన్నారు.

సోలార్ పవర్ ప్లాంటు పనుల పరిశీలన

చెన్నూరు: చెన్నూరులోని 2ఇంక్లైన్ శివలింగాపూర్ గనిఆవరణలో నిర్మిస్తున్న11మెగావాట్ల సోలార్‌పవర్‌ప్లాంట్ పనులను శుక్రవారం డైరెక్టర్ ఈ అండ్‌ఎం సత్యనారాయణరావు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏప్రిల్15లోగాసోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించాలని, ఇందుకు కావాల్సిన అన్నిఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీరాంపూర్ జీఎంసంజీవరెడ్డి, సోలార్ జీఎం జానకిరాం, అధికారులురావు, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్, అప్పారావు, రవీందర్ పాల్గొన్నారు.

ప్రమాదానికి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలి

బెల్లంపల్లి, మార్చి 22 : ఎస్ఆర్పీ1 ఇంక్లైన్‌లో సత్యనారాయణ అనే రూప్లేసర్ కార్మికుడు ప్రమాదవశాత్తూ పుల్లిలో రెండు కాళ్లు ఇరుక్కుపోవడంతో అతని కాళ్లు తెగిపోయాయని, ఇందుకు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి మణిరాంసింగ్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని యూనియన్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వారం రోజుల క్రితం మందమర్రి ఏరియాస్టోర్‌లో రాజు అనే కార్మికుడు మృతిచెందిన ఘటన మరువకముందే ఎస్ఆర్పీ వన్ ఇంక్లైన్‌లో కార్మికుడి రెండు కాళ్లు తెగిపోవడం బాధాకరమన్నారు. విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో నారాయణ, పాషా, చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుడికి ఏఐటీయూసీ నాయకుల పరామర్శ..

శ్రీరాంపూర్, మార్చి 22: శ్రీరాంపూర్ ఏరియా ఎస్ఆర్పీ1 గనిలో జరిగిన ప్రమాదంలో గాయపడిన సాదం సత్యనారాయణను ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వి సీతారామయ్య, డిప్యూటీ ప్రధానకార్యదర్శి కె వీరభద్రయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కె బాజీసైదా కరీంనగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో శుక్రవారం పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని, మెరుగైన వైద్యం అందించేలా చూస్తామని పేర్కొన్నారు. అనంతరం సీతారామయ్య మాట్లాడుతూ వెంటనే ట్రై పార్టైడ్ సమావేశాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గని పిట్ కార్యదర్శి దాడి రాజయ్య, అఫ్రోజ్‌ఖాన్, కామెర వేణు, తదితరులు పాల్గొన్నారు.

క్లర్కులకు సౌకర్యాలు కల్పించాలి

మందమర్రిటౌన్, మార్చి 22: మందమర్రిఏరియాలోని ఆయాగనులు, డిపార్టుమెంట్లలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్‌లకు సరైన టేబుళ్లు, ఇతర సామాగ్రి లేక ఇబ్బందులు పడుతున్నారని వెంటనే వాటిని సమకూర్చాలని గుర్తింపు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మందమర్రి జీఎం మనోహర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ, దాగం మల్లేష్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వెల్డర్ పోస్టులు ప్రవేశపెట్టాలి

మందమర్రిటౌన్, మార్చి 22: సింగరేణి సంస్థలో ఇటీవల పలుఉద్యోగాల భర్తీకోసం ఎక్స్‌టర్నల్, ఇంటర్నల్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసిందని, ఇందులో వెల్డర్ ఎక్స్‌టర్నల్ పోస్టులు లేవని, ఇవి కూడా పెట్టాలని కోరుతూ శుక్రవారం జీఎం మనోహర్‌కు అభ్యర్థులు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సాయికిరణ్, రాకేష్ పాల్గొన్నారు.

వైండింగ్ సెక్షన్ ఏర్పాటు చేయాలి

మందమర్రిటౌన్, మార్చి 22: మందమర్రి ఏరియా వర్కుషాపులో వైండింగ్‌సెక్షన్ ఏర్పాటుచేయాలని ఏఐటీయూసీ బ్రాంచ్‌కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ గతంలో ఈ సెక్షన్ ఉండేదని, తద్వారా చాలామంది మహిళఉద్యోగులు పని చేసేవారని తెలిపారు. కాలిన మోటార్లకు, ఇతర పరికరాలకు వైండింగ్ చేయడం తప్పనిసరి అయినందున వైండింగ్‌సెక్షన్ ఏర్పాటు చేయాలని తెలిపారు.

అధికారులకు సన్మానం

మందమర్రిటౌన్, మార్చి 22: మందమర్రి ఏరియాలోని కేకే5గని మేనేజర్‌గా పనిచేసి కాసిపేటగనికి బదిలీపై వెళ్తున్న భూశంకరయ్యను శుక్రవారం గనిఆవరణలో ఘనంగా శాలువాలతో సన్మానించారు. అలాగే కాసిపేట2 గని నుంచి కేకే5గనికి మేనేజర్‌గా బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించిన అల్లావుద్దీన్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆఫీస్ సూపరింటెండెంట్ బుచ్చయ్య, అసిస్టెంట్ సూపరింటెండెంట్ సురేందర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ధర్మారంలో రోడ్డు ప్రమాదం

● ఇద్దరికి గాయాలు

కోనరావుపేట, మార్చి 22 : రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం ధర్మారం గ్రామంలో బైక్‌పై కూర్చున్న వ్యక్తిని మరో వాహన దారుడు ఢీకొట్టడంతో ఇద్దరికీ తీవ్రగాయాలయ్యాయి. దీంతో వీరిని సిరిసిల్ల ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. స్థానికుల కథనం ప్రకారం.. కోనరావుపేట మండలం మల్కపేట గ్రామంలో పనిచేస్తున్న వలస కూలి రాంబాబు ధర్మారం గ్రామంలోని ఆన్‌లైన్ సెంటర్ వద్ద ఆగి ఉన్న బైక్‌పై కూర్చున్నాడు. తంగళ్లపల్లి మండలం అంకిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి బైక్‌పై వెళ్తూ ఆగి ఉన్న బైక్‌ను ఢీకొట్టడంతో ఇద్దరూ కిందపడిపోయారు. వారికి తీవ్ర గాయాలు కావడంతో సిరిసిల్ల ఆస్పత్రికి తరలించారు.

నిందితులకు జరిమానా

బెల్లంపల్లి, మార్చి 22: వ్యక్తిని బెదిరించిన కేసులో ముగ్గురు నిందితులకు శుక్రవారం బెల్లంపల్లి జడ్జి ముకేష్ జరిమానా విధించారు. 2017లో చాకెపల్లికి చెందిన ముడిమడుగుల తిరుపతి కొత్తపల్లి శివారులోని భూమిలో దున్నుతుండగా ఇదే గ్రామానికి చెందిన దుర్గం లింగయ్య, అతని కొడుకులు దుర్గం మల్లేష్, శేఖర్‌లు అడ్డుపడి దూషిస్తూ గొడ్డలితో బెదిరించారు. దీంతో బాధితుడు భీమిని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేసి చార్జీషీట్ దాఖలు చేశారు. శుక్రవారం నిందితులను కోర్టులో హాజరుపర్చగా జడ్జి ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల చొప్పున ముగ్గురికి రూ. 3 వేల జరిమానా విధించారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తుల అరెస్టు


మాట్లాడుతున్న సీఐ శశిధర్‌రెడ్డి

మందమర్రిటౌన్, మార్చి 22: పట్టణంలోని చెంచు కాలనీకి చెందిన షారుక్ అనే యువకుడు గంజాయి తరలిస్తుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నట్లు సీఐ శశిధర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. షారుక్ రైల్వే ట్రాక్ వద్ద గంజాయి తరలిస్తుండగా తనిఖీ చేయగా 1100 గ్రాముల గంజాయి లభించిందన్నారు. గంజాయి విలువ రూ.40 వేలు ఉంటుందన్నారు. నిందితున్ని విచారించగా షారుక్ సోదరుడు లాడెన్‌తో కలిసి విక్రయిస్తున్నట్లు తెలిపారు. మారుతినగర్‌కు చెందిన మక్కల గంగాధర్ చెంచు కాలనీ సమీపంలో గంజాయి అమ్ముతున్నట్లు సమాచారంతో తనిఖీ చేయగా 500 గ్రాముల గంజాయి లభించిందన్నారు. గంజాయి విక్రయించినా, రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకొంటామన్నారు. ఎస్ఐ రాజశేఖర్ పాల్గొన్నారు.

దోపిడీకి పాల్పడుతున్న నిందితుల అరెస్టు

ఏసీసీ, మార్చి 22: మంచిర్యాల పట్టణంలో నడుచుకుంటూ వెళ్తున్న వారిని గాయపర్చి దోపిడికి పాల్పడుతున్న దొంగలను అరెస్టు చేసినట్లు సీఐ బన్సీలాల్ తెలిపారు. శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ హమాలీవాడకు చెందిన మాదంశెట్టి ప్రభాకర్ గతనెల 8న రాత్రి నడుచుకుంటూ ఇంటికి వెళ్తుండగా చిన్న మైసమ్మ గుడి వద్ద గుర్తు తెలియని వ్యక్తులు రాళ్లతో తలపైకొట్టి దొంగతనానికి పాల్పడ్డారన్నారు. ప్రభాకర్ మేనల్లుడు భరత్‌కుమార్ ఫిర్యాదు మేరకు జాఫర్‌నగర్‌కు చెందిన కిచ్చి అర్జు అలియాస్ అజ్జును అదే నెల 27న అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు. మరో నిందితుడు రాథోడ్ భవన్ పరారీలో ఉండగా శుక్రవారం అరెస్టు చేసినట్లు తెలిపారు. గతంలో కూడా రైల్వేస్టేషన్ సమీపంలోని దుర్గమ్మ గుడి వద్ద రాత్రి వెళ్తున్న వారిపై దాడిచేసి దొంగతనాలకు పాల్పడినట్లు ఒప్పుకున్నారన్నారు.

రేపటి రాష్ట్ర బంద్‌ను జయప్రదం చేయాలి

● మావోయిస్టు పార్టీ అధికార ప్రతినిధి జగన్

మంచిర్యాల, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలోని గడ్చిరోలి కోళ్లమర్క అటవీ ప్రాంతంలో ఇటీవల జరిగిన బూటకపు ఎన్‌కౌంటర్‌ను నిరసిస్తూ ఈనెల 24 నిర్వహించ తలపెట్టిన రాష్ట్ర బంద్‌ను ప్రజలు జయప్రదం చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) తెలంగాణ రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి జగన్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సామ్రాజ్యవాద, దళారీ, పెట్టుబడిదారుల ప్రయోజనాలను కాపాడుతూ ప్రజలపై దోపిడీకి అనుకూలంగా పాలనను కొనసాగిస్తున్నాయని ధ్వజమెత్తారు. ప్రజలకు అండగా నిలుస్తున్న మావోయిస్టు పార్టీని నిర్మూలించే లక్ష్యంతో వ్యూహాత్మకంగా సూరజ్‌కుండ్ పథకాన్ని రచించారని విమర్శించారు. ఇందులో భాగంగానే కగార్-సూర్యశక్తి పేర్లతో బహుముఖ దాడులను కొనసాగిస్తూ అణిచివేయడానికి పూనుకున్నారని ఆరోపించారు. ఈ నెల 19న గడ్చిరోలి జిల్లాలోని ఐరీ తాలుకా కోళ్లమర్క అడవిలో మంగు, వర్గీష్, రాజు, బుద్రామ్‌లను విషం పెట్టి, ప్రాణాలతో పట్టుకొని క్రూరంగా హింసించి కాల్చి చంపడమేగాక ఎదురుకాల్పుల కట్టుకథ అల్లారని విమర్శించారు. సమాజానికి తెలియకూడదనే నెపంతో శవాలను కూడా చూపించలేదని, అమరుల మృతదేహాలకు రీ పోస్టుమార్టం చేయాలని డిమాండ్ చేశారు. కోళ్లమర్క ఎన్‌కౌంటర్‌పై హైకోర్టు న్యాయమూర్తిచే విచారణ జరిపించాలని, ఎన్‌కౌంటర్‌కు కారకులైన వారిని తక్షణమే శిక్షించాలని డిమాండ్ చేశారు. బూటకపు ఎన్‌కౌంటర్‌ను నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 24న బంద్ పాటించాలని కోరారు.

మూడోసారి బీజేపీ గెలుపు ఖాయం


సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు

దండేపల్లి, మార్చి 22: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మూడోసారి ప్రధానమంత్రి కావడం ఖాయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ అన్నారు. కన్నెపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ మాజీ సర్పంచు గడికొప్పుల రజినిసురేందర్‌తోపాటు 300 మంది నాయకులు, కార్యకర్తలు శుక్రవారం బీజేపీలో చేరగా వారికి పార్టీ కండువా కప్పారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ 6 గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చి వాటిని అమలు చేయకుండా మోసం చేసిందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పి ఇప్పుడు కేంద్రంలో అధికారంలోకి వస్తేనే ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు సాధ్యమని సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో కేంద్రంలో 400లకు పైగా సీట్లు సాధించి మూడోసారి బీజేపీ ప్రభుత్వం అధికారం చేపడుతుందన్నారు. పెద్దపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి గోమాసే శ్రీనివాస్‌ను గెలిపించాలన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు గోపతి రాజయ్య, నాయకులు ప్రభాకర్, రవిగౌడ్, గురువయ్య, సంతోష్, రాజయ్య, సత్తయ్య, సురేందర్, కుమార్, శ్రీనివాస్, లక్ష్మణ్, మహేష్, గిరిధర్, పాల్గొన్నారు.

పాఠశాల వార్షికోత్సవం


డ్యాన్సులు చేస్తున్న చిన్నారులు

కోటపల్లి, మార్చి 22: కోటపల్లి మండల కేంద్రంలోని ఉషోదయ గ్రామర్ ప్రైవేటు పాఠశాలలో శుక్రవారం వార్షికోత్సవ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఆటాపాటలతో విద్యార్థులు చేసిన డ్యాన్సులు ఆకట్టుకున్నాయి. ప్రైవేటు పాఠశాలల సంఘం జిల్లా కార్యదర్శి కోరళ్ల శ్యాం సుందర్‌రెడ్డి మాజీ ఎంఈవో జగన్‌లు విద్యార్థులకు, తల్లిదండ్రులకు విద్యాభివృద్ధి, విలువలతో కూడిన విద్య తదితర అంశాలపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ బక్కయ్య, పాఠశాల హెచ్ఎం ఉమాదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిని కలిసిన గడ్డం బ్రదర్స్


ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం అందిస్తున్న వినోద్, వివేక్

మందమర్రిటౌన్, మార్చి 22 : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని శుక్రవారం బెల్లంపల్లి, చెన్నూరు ఎమ్మెల్యేలు గడ్డం వినోద్, గడ్డం వివేక్‌లు హైద్రాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థిగా వంశీవివేక్‌ను ప్రకటించడంతో ముఖ్యమంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి వంశీ పాల్గొన్నారు.

రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబును చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీ వివేక్ హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. మంథని నియోజకవర్గంలో పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి ప్రచారం, అనుసరించాల్సిన విధి విధానాల గురించి మంత్రితో చర్చించారు.

పసందైన.. పల్లె కర్జూరాలు..



దండేపల్లి, మార్చి 22: వేసవి కాలంలో ప్రకృతి ప్రసాదించే ఫలాల్లో ఈత పండ్లు ఒకటి. వేసవికాలంలో చెరువు గట్టులు, రోడ్డు పక్కన ఈత చెట్లకు ఈత పండ్లు కనిపిస్తుంటాయి. వీటిని పల్లె కర్జూరాలుగా గ్రామాల్లో పిలుస్తారు. ఈత చెట్లుకు గోలలు గోలలుగా వేలాడుతాయి. మండలంలో కన్నెపల్లి, ముత్యంపేట, రెబ్బనపల్లి, దండేపల్లి, మ్యాదరిపేట, నాగసముద్రం, తాళ్లపేట, ప్రధాన రహదారికి ఇరువైపుల అగుపిస్తాయి. ప్రయాణికులు వాటిని కొనుగోలు చేస్తున్నారు.

దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుల అరెస్టు


పట్టుబడిన నిందితులతో ఏసీపీ ప్రకాష్

ఏసీసీ, మార్చి 22: మంచిర్యాల పట్టణంలో ఇనుప సామాను దొంగిలిస్తున్న నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం ఏసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏసీపీ ప్రకాష్ వివరాలు వెల్లడించారు. శ్రీరాంపూర్ అరుణక్కనగర్‌కు చెందిన మోతె రమేష్, మంచిర్యాల పట్టణంలోని చున్నంబట్టివాడకు చెందిన జనగామ దినేష్, ఒడ్డెర కాలనీకి చెందిన సమ్మయ్యలు ఆటో డ్రైవర్లు. ఈ నెల 20న రాత్రి ఎంసీసీ కంపెనీ ప్రహరీ గోడ దూకి లోపలికి వెళ్లి ఓ గది తాళాన్ని పగులగొట్టి ఇనుప సామాన్లను బయటకు తరలించి వారి వెంట తీసుకువచ్చిన ట్రాలీ ఆటోల్లో నింపుతుండగా కంపెనీకి చెందిన సిబ్బంది అక్కడకు రావడంతో వాహనాన్ని వదిలి పారిపోయారన్నారు. కంపెనీ ఇన్‌చార్జీ విజయ్ గోపాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని ప్రత్యేక టీంలను ఏర్పాటు చేసి గాలిస్తుండగా అక్కడే వదిలేసిన ఆటో, ట్రాలీలు చూడడానికి రావడంతో హైటెక్ సిటీ సమీపంలో పోలీసులు పట్టుకుని విచారించగా నేరం ఒప్పుకున్నారన్నారు. ఒక ఆటో ట్రాలీ, రెండు ఆటోలు, రూ. 50 వేల విలువైన ఇనుప వస్తువులను సీజ్ చేసినట్లు తెలిపారు.

ఆదర్శ పాఠశాలల ప్రిన్సిపాళ్లపై ఫిర్యాదు

ఆసిఫాబాద్ రూరల్, మార్చి 22: ఆదర్శ పాఠశాల పేరులోనే ఆదర్శం కనిపిస్తోంది. జిల్లాలో ఉన్న రెండు పాఠశాలల్లో ప్రిన్సిపాళ్ల దీర్ఘకాలంగా తిష్టవేయడంతో అవినీతి పేరుకుపోయినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై ఆదర్శ పాఠశాలల రాష్ట్ర అదనపు డైరెక్టర్‌కు ప్రిన్సిపాళ్ల అవినీతిపై జిల్లాలోని ఆదివాసీ సంక్షేమపరిషత్ ఫిర్యాదు చేయడం జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

జిల్లాలో రెండు ఆదర్శపాఠశాలలు ఉన్నాయి. ఒకటి జిల్లా కేంద్రంలో ఉండగా మరొకటి సిర్పూర్(యు) మండలకేంద్రంలో ఉంది. పాఠశాలల రాష్ట్ర అదనపు డైరెక్టర్‌కు జిల్లాలోని ప్రిన్సిపాల్స్ అవినీతిపై ఎండగడుతూ ఎనిమిది పేజీల ఫిర్యాదు అందజేశారు. దీనిలో హాజరు కాని రోజుకు కూడా జీతాల బిల్లు చేయడం, పాఠశాలకు రాకుండా జీతం తీసుకోవడం, అడ్మిషన్లకు రూ.5వేల రూపాయలకు వరకు డబ్బు వసూలు చేయడం, మధ్యాహ్న భోజనంలో తప్పుడు బిల్లులు ఇవ్వడం, ఉపాధ్యాయులు వారానికి రెండు మూడు రోజులు హాజరుకావడం, రిపేర్లపేరుతో దొంగబిల్లులు లాంటి అంశాలతో ఫిర్యాదు చేశారు. దీనిపై ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.


ఆసిఫాబాద్‌లోని మోడల్ స్కూల్

ఆత్రం సుగుణను సన్మానించిన ఆదివాసులు


ఆత్రం సుగుణను సన్మానిస్తున్న మండల కాంగ్రెస్ నాయకులు

జైనూర్, మార్చి 22: గిరిజన ప్రాంతంలో విద్యార్థులకు చక్కటి విద్యనందించిన ఆత్రం సుగుణ ఉపాధ్యాయ ఉద్యోగానికి రాజీనామా చేసి సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో గురువారం రాత్రి కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆమె శుక్రవారం తొలిసారిగా జైనూరు మండలానికి రావడంతో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఆదివాసులు వందలాదిగా తరలివచ్చి కాంగ్రెస్ పార్టీ ఎంపీ ఆశావహురాలు ఆత్రం సుగుణను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆమె మండలంలోని మార్లవాయి గ్రామాన్ని సందర్శించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తప్పక తనకు కాంగ్రెస్‌పార్టీ ఆశీర్వచనాలు ఉంటాయని తనకు టికెట్టు వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మార్లవాయి మాజీసర్పంచ్ కనక ప్రతిభ, మండలపార్టీ అధ్యక్షుడు అబ్దుల్ ముకీద్, పెందుర్ ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

మద్యం అధిక ధరలకు అమ్మకాలపై ఫిర్యాదు

కాగజ్‌నగర్, మార్చి 22: చింతలమానేపల్లి మండలం గూడెం మద్యం దుకాణంలో అధికధరలకు మద్యం అమ్మకాలు జరుపుతున్నట్టు గ్రామస్థులు శంకర్, దాదాజీ తదితరులు ఎక్సైజ్ సీఐ జాన్‌శామ్యూల్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గూడెం మద్యం దుకాణంలో ఫుల్‌బాటిల్‌కు రూ.300అధికంగా తీసుకున్నట్టు తెలిపారు. ఈవిషయంపై గ్రామస్థులు సంబంధిత దుకాణదారుడికి సీఐముందే ఫోన్లో స్పీకర్‌పెట్టి మాట్లాడగా అధిక ధరల విక్రయాల వివరాలను వెల్లడించాడు.

గర్భిణులకు సీమంతం

సిర్పూర్(టి), మార్చి 22: పోషన్ పక్షోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండలకేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేకాధికారి సురేష్‌బాబు మాట్లాడుతూ స్త్రీశిశు సంక్షేమ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

చింతలమానేపల్లి, మార్చి 22: పౌష్టికాహారంతోనే తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సీడీపీవో విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం మండలంలోని కర్జవెల్లి గ్రామంలో పోషణమాసోత్సవాల్లో భాగంగా పోషన్‌పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు శంకరమ్మ, సాహెరాబేగం తదితరులు పాల్గొన్నారు.

హామీలతో ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్: ఎమ్మెల్సీ దండె విఠల్

బెజ్జూరు, మార్చి 22: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీప్రజలకు 420హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని ఎమ్మెల్సీ దండే విఠల్ అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఆదరించాలని కోరారు. అభ్యర్థి ఆత్రం సక్కు మాట్లాడుతూ కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పుష్పలత, శ్యాంరావు, రాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఆటపాటలతో పాటు మెరుగైన విద్యనందించాలి

వాంకిడి, మార్చి 22: ప్రాథమిక స్థాయి విద్యార్థులకు ఆటపాటలతోపాటు మెరుగైనవిద్యను అందించినప్పుడే విద్యార్థులకు చదువుపై ఆసక్తి కలుగుతుందని స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు నటరాజ్ అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని ప్రాథమికపాఠశాలలో వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వినేష్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.


సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న విద్యార్థినులు

మెట్టు దిగని ఎస్పీఎం యాజమాన్యం

● పట్టువీడని లారీ అసోసియేషన్

కాగజ్‌నగర్, మార్చి 22: ఎస్పీఎంలో ఉత్పత్తిచేసిన కాగితాన్ని ఇతర ప్రాంతాలకు రవాణా చేసేందుకు లారీ అసోసియేషన్‌తో ఎస్పీఎం యాజమాన్యం రెండేళ్లకొక మారు ఒప్పందం చేసుకుంటుంది. అయితే ఈసారి జరిగే ఒప్పందానికి మాత్రం యాజమాన్యం ఒప్పుకోవడం లేదు. దీంతో లారీ అసోసియేషన్ సభ్యులు ఈనెల6 నుంచి సమ్మె బాట కొనసాగిస్తున్నారు. లారీ అసోసియేషన్ డిమాండ్లలో ప్రధానంగా కాగితం లోడింగ్‌కు ప్రస్తుతం ఇస్తున్న ధరకు 30శాతం అదనంగా ఇవ్వాలి, సుదూరు ప్రాంతాలకు వెళ్లాల్సి ఉంటున్న నేపథ్యంలో అక్కడి వెయిటింగ్ చార్జీలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. దీనిపై యాజమాన్యం నుంచి స్పష్టత రాకపోవటంతో సమ్మెను యథావిధంగా కొనసాగిస్తున్నారు. గురువారం మధ్యాహ్నం కూడా లారీ అసోసియేషన్ సభ్యులు, ఎస్పీఎం ప్రతినిధులతో చర్చలు జరిపారు. అయినా కూడా ఎలాంటి పురగతి లేదు.

డిమాండ్లన్నీ న్యాయమైనవే..
-వెన్న కిషోర్‌బాబు, లారీ అసోసియేషన్ అధ్యక్షుడు



పేపర్ లోడింగ్ చేసి దేశంలో అన్ని రాష్ట్రాల్లో అన్‌లోడింగ్ చేస్తుంటాం. డీజిల్ ధరలు, పెరుగుతున్న నిత్యవసర ధరలకు అనుగుణంగా రేటు పెంచాలని కోరాం. అలాగే ఇతర ప్రాంతాల్లో అన్‌లోడింగ్ చేసే సమయంలో వేయింటింగ్ చేయాల్సి వస్తోంది. వీటితోపాటు ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరాం. యాజమాన్యం మా డిమాండ్లను పరిష్కరించేందుకు ముందుకు రావడం లేదు.

అంబేద్కర్ కాలనీలో తాగునీటికి ఇబ్బందులు


బోరువద్ద నీటి కోసం గ్రామస్థులు

పెంచికలపేట, మార్చి 22: మండలంలోని ఎల్లూరు గ్రామ పరిధిలోని అంబేద్కర్ కాలనీలో పది రోజులుగా బోరు పనిచేయకపోవడంతో కాలనీవాసులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి బోరుకు మరమ్మతులు చేయించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

కోలాం గిరిజనులు వివాహ ఖర్చులు తగ్గించాలి

కెరమెరి, మార్చి 22: కోలాంగిరిజనులు వివాహ ఖర్చులను తగ్గించాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆత్రం భీంరావు అన్నారు. శుక్రవారం కోలాం కోటారి గ్రామంలో జిల్లాకోలాం సంఘం సదస్సుకు హాజరయ్యారు. అనంతరం మాట్లాడుతూ కోలాం గిరిజనులు ఆర్భాటాలకు పోకుండా తమ వివాహల ఖర్చులను తగ్గించాలన్నారు. అలాగే బాల్యవివాహాలను అరికట్టాలన్నారు. దురల వాట్లను మానేయాలన్నారు. సమావేశంలో జిల్లాఅధ్యక్షుడు జలపత్‌రావు, రాజు, భుజంగ్ రావు, అన్నిగా, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్లు ప్రలోభాలకు లోనుకావద్దు


లింగాపూర్ మార్చి 22: ఓటర్లు రాజకీయ పార్టీల ప్రలోభాలకు ప్రజలు లోనుకావద్దని లింగాపూర్ ఆర్ఐలు ప్రకాష్, ప్రదీప్ వెకటనారాయణ అన్నారు. శుక్రవారం వారు మండలకేంద్రంలో గ్రామస్థులకు ఓటు విలువపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటర్లు ఎవరి ప్రలోభాలకు లోనుకాకుండా తమకు నచ్చిన వారికి ఓటు వేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

క్రేన్, ఆటో ఢీ: ఒకరికి గాయాలు

రెబ్బెన, మార్చి 22: మండలకేంద్రంలో శుక్రవారం క్రేన్, ఆటో ఢీకొనటంతో ఒకరికి గాయాలయ్యాయి. కిష్టాపూర్ నుంచి రెబ్బెనకు వస్తున్న ఆటోను క్రేన్ ఢీకొంది. దీంతో ఆటోడ్రైవర్ మహేష్, ఆటోలో ప్రయాణిస్తున్న మహిళకు గాయాలయ్యాయి. వెంటనే ప్రాథమిక చికిత్సకోసం ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కుటుంబ సభ్యులు పోలీసులకు సమచారం అందించారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



మంచిర్యాల జిల్లా వార్తలు

5

శనివారం 23 మార్చి 2024

ఉచిత దంత వైద్య శిబిరం

హాజీపూర్, మార్చి 22: వేంపల్లిలో హెల్పేజ్ ఇండియా, ఇన్ఫర్ సంస్థల ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వృద్ధులకు దంత వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి కృత్రిమ దం తాలను అమర్చారు. దంత వైద్యులు అజయ్, హెల్పేజ్ ఇండియా ప్రాజెక్టు ఇన్‌చార్జి శివకృష్ణ, పంచాయతీ కార్యదర్శి ప్రతిభ, తిరుపతి పాల్గొన్నారు.



రంజాన్ వేళలు

ఇఫ్తార్ | 6:29 శనివారం

సహర్ | 4:54 ఆదివారం

నీటి సమస్య పరిష్కరించాలని నిరసన



క్యాంపు కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

చెన్నూరు, మార్చి 22: చెన్నూరులోని గుడిసె వాసుల నీటి సమస్య తీర్చాలని శుక్రవారం చెన్నూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట గుడిసెవాసుల మహిళలు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. పీవో డబ్ల్యూ జిల్లా నాయకురాలు మద్దెల భవానీ వారికి మద్దతు తెలిపారు. ఆమె మాట్లాడుతూ 11 నెలలుగా గుడిసె వాసులు తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు నివాసాల్లోకి వచ్చి ఓట్లు వేసి గెలిపిస్తే బోర్లు వేయిస్తానని చెప్పిన ఎమ్మెల్యే ఇప్పటి వరకు ఒక్క బోరు కూడా వేయించలేదన్నారు. వెంటనే నీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ప్రసన్న, రుక్మిణి, సుజాత, రేవతి, ప్రియాంక, మౌలిక, పద్మ, శిరీష పాల్గొన్నారు.

ఎయిడ్స్ నిర్మూలన అందరి బాధ్యత



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఎంవో శ్రీమన్నారాయణ

మంచిర్యాల కలెక్టరేట్, మార్చి 22: ఎయిడ్స్ నిర్మూలన అందరి బాధ్యత అని ఆర్ఎంవో శ్రీమన్నారాయణ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సంపూర్ణ సురక్ష కేంద్రం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్ నిర్మూలనకు అందరూ కలిసికట్టుగా పోరాడాలని, ఇందుకు తమ వంతు సహాయ సహకారాలు ఉంటాయన్నారు. హెచ్ఐవీ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించేందుకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ఐసీటీసీ కౌన్సిలర్లు శ్రీనివాస్‌రెడ్డి, జగన్ మోహన్, ఆంజనేయులు, డీఆర్‌పీ శ్రీలత, డీఎస్ఆర్‌సీ కౌన్సిలర్ నరేందర్, పీఆర్‌టీసీ కౌన్సిలర్ నర్మద, ల్యాబ్ టెక్నీషియన్ రాజేందర్, సంపూర్ణ సురక్షకేంద్రం మేనేజర్ సతీష్ ఉన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేయించాలి



గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేస్తున్న జిల్లా పశువైద్యాధికారి

హాజీపూర్, మార్చి 22: పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేయించాలని జిల్లా పశువైద్యాధికారి రమేష్‌బాబు పేర్కొన్నారు. శుక్రవారం వేంపల్లిలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాల శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 62 ఆవు జాతి, 155 గేదె జాతి పశువులకు టీకాలు వేయించామన్నారు. పశువుల పాకలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున పశువులను ఎండ బారి నుంచి కాపాడుకోవాలని, స్వచ్ఛమైన తాగునీరు, మేత అందించాలని సూచించారు. పశువైద్యాధికారులు శాంతి రేఖ, సరిత, సిబ్బంది అగ్నివేశ్, స్వప్న, నారాయణ, సికిందర్ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల విద్యార్థుల క్షేత్ర పరిశీలన



విజయ డెయిరీలో విద్యార్థులు

లక్సెట్టిపేటరూరల్, మార్చి 22: క్షేత్ర పరిశీలనతో విద్యార్థులకు ప్రత్యక్ష అనుభవం కలుగుతుందని ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల జంతుశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ పత్తి చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని విజయ పాల కేంద్రాన్ని ఫీల్డ్ విజిట్‌లో భాగంగా విద్యార్థులతో కలిసి సందర్శించారు. పాల కేంద్రంలోని యంత్రాలు, వాటి పనితీరు గురించి అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ డెయిరీ ఉత్పత్తులు నిత్య జీవితంలో ఒక భాగంగా మారినట్లు తెలిపారు. పాడి రైతుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సబ్సిడీ సంక్షేమ పథకాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. విజయ డెయిరీ మేనేజర్ సతీష్, అధ్యాపకుడు కుమారస్వామి, విద్యార్థులు పాల్గొన్నారు.

నస్పూర్‌లో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్



ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న అధికారులు, పోలీసులు

నస్పూర్, మార్చి 22: లోక్‌సభ ఎన్నికల సందర్భంగా నస్పూర్ పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. తెలంగాణ తల్లి చౌరస్తా నుంచి నస్పూర్ కాలనీ, గోదావరి కాలనీల మీదుగా రాయల్ చౌరస్తా నుంచి సీసీసీ కార్నర్ మీదుగా తెలంగాణ తల్లి చౌరస్తా వరకు కేంద్ర భద్రత బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ చేపట్టారు. మంచిర్యాల ఏసీపీ ఆర్.ప్రకాష్ మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడానికి ప్రజలు సహకరించాలన్నారు. ఎన్నికల కోడ్ అమలులో భాగంగా నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. కట్టుదిట్టమైన నిఘా వ్యవస్థను ఏర్పాటు చేశామన్నారు. ఫ్లాగ్‌మార్చ్‌లో రూరల్ సీఐ ఆకుల అశోక్, నస్పూర్, హాజీపూర్ ఎస్సైలు రవికుమార్, సురేష్, అదనపు ఎస్సై జితేందర్, కేంద్ర బలగాలు, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.



ప్రధాన పార్టీల అభ్యర్థుల ఖరారు

- కాంగ్రెస్ నుంచి గడ్డం వంశీకృష్ణ
- బీఆర్ఎస్ నుంచి కొప్పుల ఈశ్వర్
- బీజేపీ నుంచి గొమాసే శ్రీనివాస్
- జోరుగా కార్యకర్తల సన్నాహక సమావేశాలు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

పెద్దపల్లి పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేయనున్న అభ్యర్థులను ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ప్రకటించాయి. గురువారం రాత్రి కాంగ్రెస్ పార్టీ గడ్డం వంశీకృష్ణ పేరును ఖరారు చేయగా, అంతకుముందే బీఆర్ఎస్ నుంచి మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, బీజేపీ అభ్యర్థిగా గొమాసే శ్రీనివాస్‌ల పేర్లను ప్రకటించారు. ఈ ముగ్గురి అభ్యర్థుల మధ్యే ప్రధానంగా పోటీ జరగనున్నది.

ఇప్పటికే బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులు పార్టీపరంగా నాయకులు, కార్యకర్తలను సన్నద్ధం చేసేందుకు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సన్నాహక సమావేశాలను ఏర్పాటు చేస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికలకు ఈనెల 16న కేంద్ర ఎన్నికల కమిషనర్ షెడ్యూల్‌ను ప్రకటించారు. దేశవ్యాప్తంగా ఏడు విడతల్లో ఎన్నికలను నిర్వహిస్తుండగా, నాల్గవ విడతలో రాష్ట్రంలో ఎన్నికలను నిర్వహిస్తున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే నెల 18న జారీ కానుండగా, అదేరోజు నుంచి 25వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరించనున్నారు. 26న నామినేషన్ల పరిశీలన, 29న ఉపసంహరణకు గడువు విధించారు. మే 13న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్ నిర్వహించనున్నారు.

పూర్వ వైభవం కోసం కాంగ్రెస్ ఆరాటం..

పోలింగ్‌కు యాభై రోజుల సమయం ఉండడంతో అభ్యర్థులు గెలుపు ప్రణాళికలు రూపొందించుకుంటున్నారు. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని పెద్దపల్లి, మంథని, రామగుండం, ధర్మపురి, మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ క్లీన్ స్వీప్ చేసింది. దీంతో పార్లమెంట్ ఎన్నికల్లోనూ ఇక్కడ కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగురవేస్తామని ఆ పార్టీ నేతలు ఆశాభావంతో ఉన్నారు. ఈ నియోజకవర్గం నుంచి చివరిసారిగా 2009లో కాంగ్రెస్ పార్టీ నుంచి డాక్టర్ గడ్డం వివేక్ గెలుపొందగా, 2014, 2019 ఎన్నికల్లో వరుసగా బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు బాల్క సుమన్, బొర్లకుంట వెంకటేశ్ నేత గెలుపొందారు. ఈ ఎన్నిక ల్లో పూర్వ వైభవాన్ని చాటాలని ఆ పార్టీ నేతలు ఉవ్విళ్లూరుతున్నారు.

పార్టీ అభ్యర్థిగా వివేక్ తనయుడు గడ్డం వంశీకృష్ణ పోటీ చేస్తుండగా, వివేక్ సోదరులు ఇరువురు చెన్నూర్, బెల్లంపల్లి అసెంబ్లీ నియోజక వర్గాల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మాజీ కేంద్ర మంత్రి గడ్డం వెంకటస్వామి ఇదే నియోజక వర్గం నుంచి పలుమార్లు ఎంపీగా గెలుపొందడంతో పాటు కేంద్ర మంత్రిగా పని చేసిన నేపథ్యంలో ఆయన వారసత్వంతో రాజకీయాల్లోకి వచ్చిన వివేక్, ఆయన వారసుడిగా వచ్చిన వంశీకృష్ణ పోటీ చేయనున్నారు. ఈ ప్రాంతానికి వాళ్లు సుపరిచితులు కావడంతో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండడం తమకు కలిసి రానున్నదని భావిస్తున్నారు. ప్రచారానికి కూడా సమయం ఉండడంతో పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలో వ్యూహాత్మకంగా ముందుకు సాగేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు.

సత్తాచాటేందుకు బీఆర్ఎస్ సంసిద్ధం..

వరుసగా మూడోసారి గెలుపొంది హ్యాట్రిక్ సాధించేందుకు బీఆర్ఎస్ సంసిద్ధమవుతోంది. ఇక్కడి నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న సిట్టింగ్ ఎంపీ బొర్లకుంట వెంకటేశ్ నేతకు ఈసారి టికెట్ ఇవ్వకుండా మరొకరికి ఇవ్వాలని పార్టీ అధినేత కేసీఆర్ భావించారు. దీంతో వెంకటేశ్ నేత కాంగ్రెస్‌లో చేరారు. కానీ ఆయనకు పార్టీ టికెట్ రాకపోగా, రెంటికి చెడ్డ రేవడిలా ఆయన పరిస్థితి మారింది. పార్టీ సీనియర్ నేత ఆరుసార్లు అసెంబ్లీ ఎన్నికల్లో విజయబావుటా ఎగురవేసిన మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు మొదటి విడతలోనే కేసీఆర్ టికెట్ ప్రకటించారు. సింగరేణి కార్మికుడిగా పని చేస్తూ రాజకీయాల్లోకి వచ్చిన కొప్పుల ఈశ్వర్ పెద్దపల్లి పార్లమెంట్ పరిధి లో సత్సంబంధాలు కలిగి ఉన్నారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా అందరికి ఆయన సుపరిచితుడే.

ఈ ఎన్నికల్లో సింగరేణి కార్మికుల ఓట్లు కీలకంగా మారనుండడంతో పార్టీ కొప్పుల ఈశ్వర్‌ను రంగంలోకి దింపింది.

వంద రోజుల కాంగ్రెస్ పాలనలో ఇచ్చిన హామీలను సక్రమంగా నెరవేర్చలేకపోయిందని, బీఆర్ఎస్ పాలననే ప్రజలు కోరుకుంటున్నారని అంటున్న ఆ పార్టీ నాయకులు పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లు తమవైపే మొగ్గు చూపుతున్నారని ఈ ఎన్నికల్లో గెలవడం ఖాయమని అంటున్నారు. ఇప్పటికే నియోజకవర్గాల వారీగా అభ్యర్థి ఈశ్వర్ పార్టీ సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే వరకు యాత్ర నిర్వహించాలని భావిస్తున్నారు. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలో రెండు భారీ బహిరంగ సభలకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

ఖాతా తెరిచేందుకు బీజేపీ తహతహ..

పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలో కాషాయ జెండాను ఎగురవేసి ఖాతా తెరవాలని బీజేపీ తహతహలాడుతున్నది. ఏ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులకు బీజేపీ గట్టి పోటీనివ్వకపోగా, ఈసారి బలమైన నేతను బరిలోకి ఆ పార్టీ దింపుతున్నది. కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నాయకుడు, నేతకాని సామాజిక వర్గానికి చెందిన గొమాసే శ్రీనివాస్ వారం రోజుల క్రితం కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరి టికెట్ తెచ్చుకున్నారు.

ఇదే నియోజక వర్గం నుంచి 2009 ఎన్నికల్లో అప్పటి టీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి 49,031 ఓట్ల తేడాతో కాంగ్రెస్ అభ్యర్థి జి వివేక్‌పై శ్రీనివాస్ ఓటమి చెం దారు. ఆ ఎన్నికల తర్వాత 2014, 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ టికెట్ ఆశించినప్పటికీ రాలేదు.

మరోసారి తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు రంగంలోకి దిగుతున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఆయా వర్గాలతో ఉన్న పరిచయాలకు తోడు ప్రధాని నరేంద్ర మోదీ మానియా, దేశ వ్యాప్తంగా ఉన్న బీజేపీ హవా తోడై విజయం సాధిస్తామనే ధీమాతో గొమాసే శ్రీనివాస్ ఉన్నారు. ఇప్పటి కే ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలను సన్నద్ధం చేస్తున్నారు. పలు బహిరంగ సభలకు సన్నాహాలు చేస్తున్నారు.

అభ్యర్థులకు పూర్తి మెటీరియల్ అందుబాటులో ఉంచాలి



గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రాహుల్

మంచిర్యాల కలెక్టరేట్, మార్చి 22 : ప్రభుత్వ ఉద్యోగాల పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న నిరుద్యోగ అభ్యర్థులకు అవసరమైన పత్రికలు, పుస్తకాలు, మెటీరియల్ అందుబాటులో ఉంచాలని అదనపు కలెక్టర్ రాహుల్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని జిల్లా గ్రంథాలయాన్ని జిల్లా అటవీ శాఖ అధికారి శివ్ ఆశిష్‌సింగ్‌తో కలిసి సందర్శించారు. రిజిష్టర్లు, గ్రంథాలయంలోని సౌకర్యాలను పరిశీలించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని గ్రంథాలయాల్లో పాఠకులకు, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు అవసరమైన పత్రికలు, పుస్తకాలు, ఇతర మెటీరియల్ అందుబాటులో ఉంచాలన్నారు. అభ్యర్థులు సద్వినియోగం చేసుకుని పరీక్షల్లో విజయం సాధించాలన్నారు. గ్రంథాలయంలో తాగునీరు, విద్యుత్ ఇతర సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వహకులు పాల్గొన్నారు.

పోషణ పక్వాడా కార్యక్రమం

చెన్నూరు, మార్చి 22: కిష్టంపేట గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషణ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ ఇందిర పోషకాహారం, చిరుధాన్యాలు, ముర్రుపాలపై గర్భిణీలు, తల్లులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు అమృత, సుగుణ, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.

భీమారం: భీమారంలోని అంగన్‌వాడీ కేంద్రం 2, 5లో శుక్రవారం పోషణ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ రజిత పిల్లల చేత అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం పోషకాహారం, ముర్రుపాలు, చిరు ధాన్యాల ప్రాముఖ్యత గురించి వివరించారు. అనంతరం గర్భిణీలకు సీమంతం చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు,ఆయాలు పాల్గొన్నారు.

డీసీపీని కలిసిన కమాండెంట్



డీసీపీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కమాండెంట్

హాజీపూర్, మార్చి 22: మంచిర్యాల డీసీపీ అశోక్‌కుమార్‌ను శుక్రవారం గుడిపేట 13వ బెటాలియన్ కమాండెంట్ సయ్యద్ జమీల్ భాష మర్యాద పూర్వకంగా డీసీపీ కార్యాలయంలో కలిశారు. డీసీపికి పుష్పగుచ్ఛం అందజేశారు. బెటాలియన్ పోలీసులు పాల్గొన్నారు.

ఫిట్‌నెస్ లేని కళాశాల బస్సు సీజ్

బెల్లంపల్లి, మార్చి 22: పట్టణంలో రవాణా శాఖ అధికారులు శుక్రవారం వాహనాలు తనిఖీ చేశారు. సింగరేణి మహిళ డిగ్రీ కళాశాలకు చెందిన బస్సుకు ఫిట్‌నెస్ లేకపోవడంతో సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ప్రతీ ఒక్కరు వాహనాలకు ఫిట్‌నెస్‌తోపాటు ఇన్సూరెన్స్ ఉండాల ని అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఖాసీం తెలిపారు.

ఆర్థికసాయం అందజేత

దండేపల్లి,మార్చి 22: తాళ్లపేట గ్రామానికి చెందిన కన్నెపల్లి శంకరయ్యనర్సవ్వ దంపతుల కూతురు రమ్య వివాహానికి ఎంపీటీసీ కంది హేమలతసతీష్‌లు రూ.5 వేల ఆర్థికసాయంను శుక్రవారం అందజేశారు. మాజీ సర్పంచులు కాంతరావు, లింగారావు, మాజీ ఎంపీటీసీ రాజయ్య, నాయకులు సాధిక్, మధు, పాల్గొన్నారు.

గోదావరిపై బ్రిడ్జి నిర్మించాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

ఏసీసీ, మార్చి 22: గోదావరి నదిపై బ్రిడ్జి నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు అన్నారు. శుక్రవారం మంచిర్యాలలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అంతర్గాం వైపు బ్రిడ్జిని ఆనుకుని నిర్మించనున్న రోడ్డుకు సంబంధించిన అలైన్‌మెంట్‌ను తాను మార్పించానని ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు ఆరోపించడం అవాస్తవమన్నారు. తాను అలైన్‌మెంట్ మార్పించలేదన్నారు. మంచిర్యాల-అంతర్గాంను కలుపుతూ పట్టణంలోని కాలేజీ రోడ్డు వద్ద బ్రిడ్జి నిర్మిస్తే భూసేకరణ సులభతరం అవుతుందని, వేరే చోట నిర్మిస్తే బడ్జెట్ పెరుగుతుందన్నారు. బేషజాలకు పోకుండా ప్రజాప్రయోజనాల కోసం మంచిర్యాల గోదావరిపై బ్రిడ్జిని నిర్మించాలన్నారు. వెంటనే నిర్మాణం ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం



బహుమతులు అందజేస్తున్న డీఈవో

నస్పూర్, మార్చి 22: ఆర్‌బీఐ ఫైనాన్షియల్ లిటరసీ వారోత్సవాల సందర్భంగా ఫిబ్రవరిలో విద్యార్థులకు నిర్వహించిన వ్యాస రచన, నినాదాలు, డ్రాయింగ్ పోటీల్లో గెలుపొందిన నస్పూర్‌లోని తీగల్‌పహాడ్ జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు శుక్రవారం డీఈవో బహుమతులను అందజేశారు. జిల్లా స్థాయి వ్యాసరచనలో గోనె ప్రసన్నకుమార్ (తీగల్‌పహాడ్), స్లోగన్స్‌లో జి. శరణ్య (కిష్టంపేట), డ్రాయింగ్‌లో కొమిరె అనూష (కిష్టంపేట) విజయం సాధించగా వారికి రెండు వేల నగదు చొప్పున అందజేశారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామన్న తెలిపారు. లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ తిరుపతి, సెక్టోరల్ ఆఫీసర్లు కమ్మ చౌదరి, ఎంఎస్ మూర్తి, హెచ్‌ఎంలు రామన్న, సత్యనారాయణలు పాల్గొన్నారు.

గడ్డం వంశీకృష్ణకు టికెట్ కేటాయింపుపై హర్షం



బాణాసంచా పేల్చి సంబరాలు జరుపుతున్న పార్టీ శ్రేణులు

రామకృష్ణాపూర్, మార్చి 22: చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి తనయుడు గడ్డం వంశీకృష్ణకు కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం పెద్దపల్లి పార్లమెంట్ టికెట్ కేటాయించడంపై పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తంచేశారు. బాణాసంచా పేల్చి సంబరాలు జరిపారు. కాకా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో గడ్డం వంశీకృష్ణను భారీ మెజారిటీతో గెలిపిస్తామన్నారు. టీపీసీసీ కార్యదర్శి పిన్నింటి రఘునాథ్‌రెడ్డి, మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపతి రాజయ్య, మున్సిపల్ చైర్మన్ జంగం కళ, వైస్ చైర్మన్ సాగర్‌రెడ్డి, నాయకులు అబ్దుల్ అజీజ్, కౌన్సిలర్లు పుల్లూరి సుధాకర్, కొక్కుల సతీష్, నాయకులు శ్రీనివాస్, శ్రీనివాస్‌గౌడ్, సుధాకర్, రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

మందమర్రిటౌన్: పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా గడ్డం వంశీని ప్రకటించడాన్ని హర్షిస్తూ శుక్రవారం రాత్రి కాంగ్రెస్ నాయకులు మందమర్రిలో సంబరాలు నిర్వహించారు. బాణాసంచా పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. నాయకులు సొత్కు సుదర్శన్, గుడ్ల శ్రీనివాస్, పోలు శ్రీనివాస్, నర్సోజి తదితరులు పాల్గొన్నారు. పట్టణంలో యూత్ కాంగ్రెస్ నాయకులు సంబరాలు నిర్వహించారు. స్వీట్లు పంచి పెట్టారు. నాయకులు సట్ల సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

భీమారం: పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ టికెట్ చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి తనయుడు వంశీకృష్ణకు ఇచ్చిన సందర్భంగా మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు సంబరాలు నిర్వహించారు. బస్టాండ్ వద్ద బాణాసంచా పేల్చి స్వీట్లు పంచి పెట్టారు. నాయకులు రవి, లక్ష్మణ్, అరుణ్, మోహన్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.